క్లుప్తంగా

అనధికారికంగా ల్యాబ్‌లు నిర్వహిస్తే చర్యలు



ల్యాబ్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి పద్మజ

హిందూపురం టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు ల్యాబ్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి అని వైద్యాధికారిణి డాక్టర్ పద్మజ తెలిపారు. బుధవారం పట్టణంలోని రక్తపరీక్షలు నిర్వహించే ప్రైవేటు ల్యాబ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సత్యం డయాగ్నస్టిక్స్, రియా డయాగ్నస్టిక్స్ తదితర ల్యాబ్‌లను పరిశీలించి రికార్డుల నిర్వహణ, ర్యాపిడ్ కిట్స్ తదితర వాటిని పరిశీలించారు. ఇందులో భాగంగా కొన్ని అనుమతుల లోపాలున్న దుర్గా ల్యాబ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే పట్టణంలోని పలు నర్సింగ్ హోమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పద్మజ మాట్లాడుతూ నర్సింగ్ హోమ్‌లకు, క్లినిక్లకు రిజిస్ట్రేషన్ లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలను కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. ముఖ్యంగా గ్రామ దేవత చోళమాంబదేవి, శ్రీదేవి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, కన్యాక పరమేశ్వరి, జైన దేవాలయంతో పాటు మండలంలోని హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. చోళమాంబదేవి ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

సౌరశక్తిపై అవగాహన



మాట్లాడుతున్న డీఈఈ భూపతిరాజు

హిందూపురం టౌన్: కాలుష్యాన్ని నిరోధించడంలో సౌరశక్తి ఎంతో సహాయ పడుతుందని హిందూపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతిరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బీఐటీ కళాశాలలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌరశక్తి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ , అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



ఇంజనీరింగ్ కళాశాలలో మొక్క నాటుతున్న దృశ్యం

మడకశిరరూరల్: విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీదేవి తెలిపారు. మండల పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ దివస్ ముగింపు సందర్భంగా ఆవరణంలో డీన్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం దత్తత గ్రామాల్లో ఉత్తమ సేవ అందించిన సేవా పథకం వలంటీర్లకు బహుమతులు అందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



అంతర్ జిల్లా కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

హిందూపురం అర్బన్: వైఎస్సార్ జిల్లా రాజంపేటలో ఇంటర్ డిస్ట్రిక్ట్ కమ్ స్టేట్ లెవల్ సెలక్షన్ పోటీలు బుధవారం జరిగాయని హిందూపురం సెన్సేయి ఎస్.ఫైరోజ్ తెలిపారు. ఇందులో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ఎస్.రియాజ్, లోకేష్ ద్వితీయ స్థానాలు, ఎస్.హరీష్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అమరాపురం: మండలంలోని గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ భాస్కర్, ఈఓఆర్డీ నాగముని పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమం స్థానిక పంచాయతీ సర్పంచ్ వాగేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్, ఈఓఆర్డీ నాగముని సర్పంచ్ వాగేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వీధులు, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఏరులై పారనున్న మద్యం

- నూతన మద్యం పాలసీని తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం
- ఊరూరా బెల్ట్ షాపుల ఏర్పాటుకు రంగం సిద్ధం
- గత ప్రభుత్వ హయాంలో బెల్ట్ షాపులన్నీ పూర్తిగా తొలగింపు
- నేడు ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే పరిస్థితి





బెల్ట్ షాపుల ఏర్పాటుకు సన్నాహాలు

మడకశిర: జిల్లాలోనే పూర్తిగా కర్ణాటక సరిహద్దుకు అనుకుని ఉన్న మడకశిర నియోజకవర్గంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పుణ్యాన ఇక నుంచి మద్యం ఏరులై పారనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో తీసుకొచ్చిన మద్యం పాలసీకి ప్రస్తుత ప్రభుత్వం స్వస్తి పలికింది. కొత్తగా మద్యం పాలసీని తీసుకొచ్చింది. దీంతో ప్రైవేట్ వ్యక్తులు ఇక నుంచి మద్యం షాపులను నిర్వహించనున్నారు. వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం షాపులను నిర్వహించారు. దీంతో గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేశారు. ఈనెల 12 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుంది. లాటరీల్లో మద్యం షాపులు దక్కించుకున్న వారు గ్రామాల్లో బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

మద్యం షాపుల సంఖ్య పెంపు

నియోజకవర్గంలో మద్యం షాపుల సంఖ్యను కూడా కూటమి ప్రభుత్వం పెంచింది. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో 6 మద్యం షాపులను మాత్రమే ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం 10 మద్యం షాపులను ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసింది. మడకశిర పట్టణంలో 2, మడకశిర రూరల్ మండలంలో 2, అమరాపురం, గుడిబండ మండలాల్లో 2 చొప్పున, అగళి, రొళ్ల మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మద్యం షాపులను ఏర్పాటు చేయనున్నారు.

బెల్ట్ షాపుల ఏర్పాటుకు సన్నాహాలు

నియోజకవర్గంలోని అన్ని మద్యం షాపులపై అధికార పార్టీ నాయకులు కన్నేశారు. అన్ని షాపులు కూడా కూటమి నాయకులకు దక్కే అవకాశం ఉంది. దీంతో కూటమి నాయకులు అన్ని మండలాల్లోని గ్రామాల్లో బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో కూడా బెల్ట్ షాపులను తెరవనున్నారు. ఈ బెల్ట్ షాపులను కూడా గ్రామాల్లో అధికార పార్టీ సానుభూతి పరులకు కట్టబెట్టడానికి రంగం సిద్ధం చేశారు. ఒక్కో గ్రామంలో మూడు నుంచి ఐదు బెల్ట్ షాపులను తెరవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో బెల్ట్ షాపులను ఏర్పాటు చేయకుండా కఠిన చర్యలు తీసుకుంది. దీంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేది. అయితే ఇక నుంచి బెల్ట్ షాపులు ఏర్పాటు కానున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలగడం ఖాయమని భావిస్తున్నారు. గ్రామాల్లో తాగుబోతులు వీరంగం సృష్టించి గొడవలకు దిగే అవకాశం లేకపోలేదు. బెల్ట్ షాపుల పుణ్యాన మహిళలకు ఇబ్బందులు ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బెల్ట్ షాపులు ఏర్పాటు కాకుండా చూడాలి



కూటమి ప్రభుత్వం గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు కాకుండా చూడాలి. బెల్ట్ షాపులు ఏర్పాటైతే ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతుంది. శాంతిభద్రతలు అదుపు తప్పడం ఖాయం. వైఎస్ జగన్ హయాంలో బెల్ట్ షాపులు లేకపోవడంతో గ్రామాల్లో ప్రశాంతత నెలకొంది. ఈ వాతావరణం ఇలాగే కొనసాగాలంటే బెల్ట్ షాపులను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తే మహిళలు ఎదురు తిరగడం ఖాయం.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

కుక్కల దాడిలో గాయపడిన జింక



పరిగి: మండలంలోని ఎర్రగుంట సమీపంలో బుధవారం ఓ జింక కుక్కల దాడిలో గాయపడింది. పొలాల వైపు వచ్చిన జింక పిల్లను తరుముతూ కుక్కలు వెంటపడ్డాయి. ఈక్రమంలో జింక పిల్లకు గాయాలయ్యాయి. స్థానిక యువకులు గమనించి కుక్కల బారి నుంచి జింకను రక్షించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి జింక పిల్లను అప్పగించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కే.బేబీ



బి.పూజిత

లేపాక్షి: అనంతపురంలో 1న జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో మండల కేంద్రంలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కే.బేబీ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవీసీ గిరి మాట్లాడుతూ విద్యార్థిని బేబీ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. అలాగే రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.పూజిత అనంతపురం జట్టులో గోల్ కీపర్‌గా వ్యవహరించి, జట్టు రెండోస్థానంలో నిలవడానికి దోహదం చేసిందన్నారు.

బీసీల కులగణన చేపట్టాల్సిందే



మహాధర్నా పోస్టర్లు ప్రదర్శిస్తున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం: బీసీ కుల గణన కోసం బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. స్థానిక ఆబాద్‌పేటలోని బీఎస్పీ ఆఫీసు వద్ద పార్టీ వ్యవస్థాపకులు కాన్సీరాం వర్ధంతి నిర్వహించారు. అనంతరం బీసీల కుల జన గణన నిర్వహించాలని విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద మహాధర్నా చేపట్టినట్లు శ్రీరాములు తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు చేస్తున్న అన్యాయం చేస్తున్నాయని, ఇందులో భాగంగానే నిరసనకు దిగనున్నట్లు చెప్పారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల కుల జన గణన నిర్వహించాలని లేకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. బీసీల పార్టీ అంటూ టీడీపీ గొప్పలు చెప్పుకుంటూ బీసీ అన్యాయం చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబుకు బీసీల కులగణన అవసరం లేదనట్లు ప్రవర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కోశాధికారి హరికుమార్, నాయకులు నారాయణ, గంగప్ప, చిరంజీవి, నరసింహప్ప, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై బ్లేడుతో దాడి



గాయపడిన ఇమ్రాన్

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం సంతేబిదనూరులో గోపాల్ అనే వ్యక్తి ఇమ్రాన్ అనే వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గోపాల్, ఇమ్రాన్ స్నేహితులు. అయితే గోపాల్ నుంచి ఇమ్రాన్ రూ.5 వేలు అప్పు తీసుకున్నాడు. పలుమార్లు గోపాల్ డబ్బు విషయం అడగ్గా ఇమ్రాన్ ఏదో సమాధానం చెప్పి తప్పించుకునేవాడు. బుధవారం రాత్రి గోపాల్‌ను మరో మారు డబ్బు అడగటంతో నీకు ఇష్టం వచ్చింది చేసుకోపో అని సమాధానం ఇవ్వడంతో గోపాల్ ఆగ్రహంతో ఇమ్రాన్‌పై బ్లేడ్‌తో దాడి చేశాడు. గాయపడిన అతన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మడకశిరరూరల్: ఆర్థిక సమస్య కారణంగా పేద విద్యార్థినులు చదువుకు దూరం కాకుండా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023- 24 సంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు పేద విద్యార్థినులకు హెచ్‌ఎం విశ్వనాథ్ సహకారంలో 32 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆర్థికసాయం చేశారు. శ్యాలినికి రూ.15 వేలు, భవితకు రూ.7 వేలు, సాయి స్వర్ణలతతో పాటు మడకశిరకు చెందని విద్యార్థినికి తలా రూ.7 వేలు అందించామన్నారు.

పరిహారం చెక్కు అందచేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: తాలూకాలోని కోడిగేహళ్లిలో ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందిన శ్రీనివాస్ భార్య విజయలక్ష్మికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల పరిహారాన్ని ఎమ్మెల్యే వెంకటేష్ బుధవారం అందజేశారు. తహసీల్దార్ వరదరాజు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్, బత్తినేని నాని, శంకరరెడ్డి పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి బృందం



అమరాపురం ఎంపీడీఓ కార్యాలయంలో..



హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



పెనుకొండ సబ్ కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్



రొద్దం: కార్మికులను సన్మానిస్తున్న అధికారులు



హిందూపురం హెడ్ పోస్టాఫీసులో..



హిందూపురం: గాంధీ సర్కిల్ వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



మడకశిరలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న పీడీ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమల్లేశ్వరి తెలిపారు. బుధవారం ఏఆర్ రొప్పంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి, ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవం, పౌష్టికాహార మాసోత్సవాలు, స్వచ్ఛత సేవా కార్యక్రమం, పౌష్టిహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, సేవలను వివరించారు. బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల పట్టణ కన్వీనర్‌గా మేదర శంకర్



గోరంట్ల: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ గోరంట్ల పట్టణ కన్వీనర్‌గా మేదర శంకర్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మేదర శంకర్ గతంలో కుడా పట్టణ కన్వీనర్ పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఇది పార్టీ అభ్యున్నతి కలిసి వస్తుందన్నారు. ఇదిలా ఉండగా.. పార్టీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తానని మేదర శంకర్ పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి కృషిచేసిన పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు.

కల్లుమర్రిలో అవగాహన ర్యాలీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామంలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై గ్రామ కార్యదర్శి వరదరాజుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీసీ హస్టల్ పక్కన పెరిగిన కంపచెట్లను కార్మికులు తొలగించి శుభ్రం చేశారు. ఇంటి పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాల్లో వీధులు, రోడ్లుపై చెత్త కుప్పలు లేకుండా కార్మికులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు శాలువాలు కప్పి సన్మానించారు. సర్పంచ్ గంగమ్మ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన తిప్పేస్వామి



మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో బుధవారం మడకశిర మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామితో పాటు ఆయన తనయుడు డాక్టర్ దినేష్ కలిశారు. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదేనని, నిరాశ చెందకుండా పార్టీ బలోపేతానికి అందరూ కలసికట్టుగా పని చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు తిప్పేస్వామి 'సాక్షి'కి తెలిపారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టాలని సూచించారన్నారు.

ప్రిన్సిపాల్ జ్యోతికి ఉత్తమ అవార్డు



ప్రిన్సిపాల్ జ్యోతిని సన్మానిస్తున్న దృశ్యం

గుడిబండ: వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్నారు. బుధవారం విజయవాడ కమ్యూనిస్టు భవనంలో ఎంఎల్‌సీ లక్ష్మణరావు చేతుల మీదుగా జ్యోతిని ఘనంగా సన్మానించి అవార్డు అందజేశారు.

పనుల గుర్తింపుపై గ్రామసభలు

రొళ్ల: మండల వ్యాప్తంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం కింద చేపట్టనున్న పనుల గుర్తింపుపై గ్రామ సభలు బుధవారం నిర్వహించినట్లు ఏపీఓ ఓబుళప్ప తెలిపారు. బీజీ హళ్లి, రొళ్ల, రత్నగిరి, మల్లినమడుగు, కాకి, గుడ్డగుర్కి తదితర పంచాయతీ కేంద్రంలో ఆయా పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయన్నారు. ఈ ఏడాది 410 ఎకరాలకు పైగా ఐదెకరాలు లోపు భూమి కలిగిన రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టామన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

పరిగి: పారిశుద్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని పరిగి పంచాయతీ సర్పంచ్ లక్ష్మీదేవి అన్నారు. పరిగి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులకు దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆర్థిక సహకారంతో 25 మందికి నూతన వస్త్రాలను అందజేశారు. తొలుత జాతిపిత మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్రెటరీ అరుణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మండల అధ్యక్షుడు బంగారు చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో కుష్టు రోగులకు నూతన వస్త్రాలు, నిత్యావసర కిట్లను న్యాయమూర్తి మాదేశ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి జపానంద మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో ఎంపీపీ చంద్రశేఖర్ మృతి



చంద్రశేఖర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చంద్రశేఖర్ (ఫైల్)

రొద్దం: ఎంపీపీ చంద్రశేఖర్ (61) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ఓదార్చారు. నాయకులు బి.నారాయణరెడ్డి, కలిపి శ్రీనివాసులు, మారుతీరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మడకశిర ఎక్సైజ్ సీఐగా నాగలక్ష్మి?

మడకశిర: మడకశిర ఎక్సైజ్ సీఐగా నాగలక్ష్మిని నియమించినట్లు తెలిసింది. ఇంతకు ముందు ఎక్సైజ్ సీఐగా పనిచేసిన ధీరజ్‌రెడ్డి మైదుకూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రసాద్‌ను మడకశిర ఎక్సైజ్ సీఐగా అధికారులు నియమించారు. అయితే ప్రసాద్ విధుల్లో చేరలేదు. దీంతో సంబంధిత ఉన్నతాధికారులు నాగలక్ష్మిని నియమించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726